క్లుప్తంగా

సౌర విద్యుత్ వనరులను వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

ఆల్విన్‌కాలనీ: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న సౌర విద్యుత్ వనరులను వినియోగించుకోవాలని నిపుణులు పిలుపునిచ్చారు. శనివారం వివేకానందనగర్ కాలనీలో ప్రచారం, అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్కీమ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఆర్ఈడీసీఓ జిల్లా అధికారి పవన్ చందు, టీజీఎస్పీడీసీఎల్ కూకట్‌పల్లి ఏఈ చైతన్య, ఆల్విన్‌కాలనీ ఏఈ వీర్య నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన, పీఎం కుసుమ్ యోజన, బయోగ్యాస్, సోలార్ పథకాల ద్వారా సౌర విద్యుత్ వినియోగం పెరుగుతుందని తెలిపారు. పవన్ చందు మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకున్న గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ పథకం వల్ల గృహ విద్యుత్ ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఓం ప్రకాష్, సిబ్బంది, కూకట్‌పల్లి నగరవాసులు పాల్గొన్నారు.

'నుక్కడ్' నాటకం



రాయదుర్గం: 'మనూ' డ్రామా క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా, 'శ్రమదాన్ ఏక్ దిన్... ఏక్ గంటా...ఏక్‌సాత్' వంటి కార్యక్రమాలపై విద్యార్థులు నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఉర్దూ యూనివర్సిటీలో పలు సామాజిక అంశాలపై విద్యార్థులు నాటక ప్రదర్శనలు ఇస్తుంటారు. వీటికి 'నుక్కడ్ నాటకం' అని శీర్షికన ప్రదర్శిస్తుంటారు.

ఆర్టీసీ ప్రయాణికుల కోసం లక్కీ డ్రా

మియాపూర్: దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా నగదు బహుమతులను అందించనున్నట్లు మియాపూర్ -1 డిపో మేనేజర్ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 27 శనివారం నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు తమ టికెట్లపై తమ పేరు, ఫోన్ నంబర్, చిరునామా రాసి బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలని తెలిపారు. అక్టోబర్ 8న సాయంత్రం ఆర్టీసీ రీజినల్(ప్రాంతీయ) కార్యాలయంలో లక్కీ డ్రా తీయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయం రూ.15వేలు, తృతీయం రూ.10వేలు నగదు బహుమతి ఇస్తారని తెలిపారు. విజేతల వివరాలను ప్రచార మాధ్యమాల ద్వారా తెలియజేస్తామన్నారు.







సరస్ మేళా-2025






వెదురు ఉత్పత్తులు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో నిర్వహిస్తున్న సరస్ మేళా- 2025 సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ మేళాను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. హస్తకళలు, నేత వస్త్రాలు, సేంద్రియ ఆహార పదార్థాలు, సహజ సౌందర్య ఉత్పత్తులు, స్థానిక ప్రత్యేకతలు, గ్రామీణ ఆవిష్కరణలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. బ్రాస్, శాండల్‌వుడ్ విగ్రహాలు, టెర్రకోట మట్టి పాత్రలు, కుండలు, కుక్కర్ తదితరాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. గొల్లభామ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, పట చిత్ర, పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటి ధర రూ.250 నుంచి 2లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి.

వెదురుతో గృహాలంకరణ ఉత్పత్తులు, ల్యాంప్, కుర్చీలు, చైర్స్, ఫ్లవర్‌వాజ్‌లు వివిధ రకాల డిజైన్స్‌తో అందుబాటులో ఉన్నాయి.వీటి ధర రూ. 350 నుంచి 2500 వరకు ఉన్నాయి.

చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకోవాలి

టీహబ్ సీఈఓ కవికృత్


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో టీహబ్ సీఈఓ కవికృత్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్ల

రాయదుర్గం: చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉపయోగపడతాయని 'టీహబ్' సీఈఓ కవికృత్ అభిప్రాయపడ్డారు. శనివారం గచ్చిబౌలి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తన ఐ-వెంచర్ ఇమ్మర్సివ్ (ఐవిఐ) ప్రోగ్రామ్ రెండవ కోహర్ట్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో 50 స్టార్టప్‌లు ఆరుమాసాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కవికృత్ మాట్లాడుతూ అనుభవం నుంచి వ్యవస్థలను సృష్టించడం, నమూనాలను గుర్తించడం, ప్రతిభావంతులైన బృందాలను సమీకరించడం నాన్ లీనియర్ వృద్ధికి ఎలా తీస్తుందో ఆయన గుర్తు చేశారు. ఐఎస్‌బీ డీన్ ప్రొ.మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ భారతదేశం పురోగతికి, తాజా ఆలోచనలు, విధానాలు చాలా ముఖ్యమైనవన్నారు.కార్యక్రమంలో ఐఎస్‌బీ ఐ వెంచర్ ఫ్యాకల్టీ, డైరెక్టర్ ప్రొఫెసర్ భగవాన్ చౌదరి ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ ఐవిఐ విద్యార్థులు, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

చండీ హోమం


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం (పటాన్ చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం చండీహోమం చేశారు. విద్యుత్ నగర్ కాలనీలో శ్రీదేవి నవరాత్రుల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద మాజీ కౌన్సిలర్ రెడ్డి సరితారెడ్డి ఆధ్వర్యంలో హోమం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో శనివారం బీజేపీ నాయకురాలు అనుషా మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు. మహిళలు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో బోయిని మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ, సీతారామపురం కాలనీ, శాంతినగర్ కాలనీ, గౌతమ్‌నగర్ కాలనీ, కృషి డిఫెన్స్ కాలనీలలో మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వరద నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలాలు ఆక్రమిస్తే ఉపేక్షించం


ప్రభుపాద లేఅవుట్‌లో నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నాలాలు ఆక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీదుబండలోని ప్రభుపాద లేఅవుట్ కాలనీలో వరదనీటి కాలువలకు అడ్డంగా అపర్ణా నిర్మాణ సంస్థ గోడ కట్టడం వలన వరద ప్రవాహం సాగక కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన శనివారం ఆ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షం వస్తే 8 ఫీట్ల లోతు నీటితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

శిల్పారామం.. దసరా వేడుకలు

మాదాపూర్: శిల్పారామం శనివారం సందడిగా మారింది. నగరవాసులు చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేశారు. 100కి పైగా స్టాల్స్‌లో ఉత్తర్‌ప్రదేశ్, ఆగ్ర, ఒడిశా కళాకారులు తయారు చేసిన మార్బుల్ గృహాలంకరణ ఉత్పత్తులు, పెయింటింగ్స్ ఆకర్షణగా నిలుస్తున్నాయి.

నాద బ్రహ్మోత్సవ్

అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవ్ 2025లో భాగంగా శనివారం ఉషా గాయత్రి, నృత్య కిన్నెర బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. కళాకారులు నీరజ, వాణిభవాని, లక్ష్మిశ్రీ, అర్చన, శ్రద్ధ, తన్మయి, లక్ష్మి వాత్సల్య, లౌక్య సమేతంగా శ్రీమన్నారాయణ, వినరో భాగ్యము, విన్నపాలు, నారాయణతే, కులకగా, ఒకపరి, చక్కనితల్లి, గోవిందాగోవిందాయని, వాడల వాడల, వీధుల వీధుల, జగడపు తదితర కీర్తనలకు తమ నృత్యాభినయంతో సందర్శకులను అలరించారు.





బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌గా 'నిథమ్'

అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్-2025 అందజేత



రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్యరంగంలో జాతీయ స్థాయిలో పేరొందిన గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)కు 'బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు' లభించింది. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం 'తెలంగాణ టూరిజమ్ కాంక్లేవ్-2025'లో అవార్డును మాదాపూర్‌లో శనివారం అందించారు. ఈ అవార్డును రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, టీజీటీడీసీ చైర్మన్ రమేష్ పటేల్, ఎండీ క్రాంతి పాల్గొన్నారు. నిథమ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, ఫ్యాకల్టీ డాక్టర్ నీరజ్ గోయల్‌లు, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు అందజేశారు. ఈ సందర్భంగా నిథమ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ కోర్సుల నిర్వహణతో పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిథమ్ విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఇది సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా..

- శిథిలావస్థలో ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డు బ్రిడ్జి
- వందలాది వాహనాల రాకపోకలు
- కొత్త బ్రిడ్జి నిర్మించాలి.. వాహనదారులు


ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులో గుంతలమయంతో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకరంగా మారడంతో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం మరమ్మతులైనా నిర్వహించాలని కోరుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని ఎస్ఎస్‌డీ స్కూల్ సమీపంలోని నాలాపై ఉన్న బ్రిడ్జి సుమారు 4 దశాబ్దాల క్రితం నిర్మించారు. దీనిపై రోజూ వందలాది వాహనాలు ప్రయాణించాయి. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవటంతో దీనిని ఆనుకుని మరో బ్రిడ్జి నిర్మించారు. నూతనంగా బ్రిడ్జి నిర్మించి పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జిని కలుపుతూ వన్‌వే‌గా రహదారిపై వాహనాల రాకపోకలు సాగించేలా సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. కానీ పాత బ్రిడ్జికి మరమ్మతులు చేయకుండా వదిలివేయటంతో అది ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జిపై ఉన్న బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. రోజు బ్రిడ్జిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి గోడలు పడిపోయేలా ఉన్నాయి. సంబంధిత అధికారులు నామమాత్రంగా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి సర్కిళ్ల నుంచి ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు రాకపోకలు సాగించేందుకు ఉన్న రహదారి ఈ బ్రిడ్జినే. రాత్రింబవళ్లు జీడిమెట్లలోని ఇండస్ట్రీ ప్రాంతానికి రా మెటీరియల్ తీసుకువెళ్లటానికి పదుల సంఖ్యలో పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.వాహనాల తాకిడికి బ్రిడ్జి ఊగుతోందని స్థానికులు, ప్రయాణికులు భయపడుతున్నారు. గతంలో ఈ బ్రిడ్జికి బదులుగా నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. నూతన బ్రిడ్జి నిర్మించిన తరువాత పాత బ్రిడ్జి స్థానంలోనే మరో కొత్త బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అయితే బ్రిడ్జి ఇరువైపులా నగరానికి తాగునీటిని సరఫరా చేసే భారీ మంచి నీటి పైపులైన్‌లు ఉన్నాయి. కాగా జలమండలి, జీహెచ్‌ఎంసి విభాగాల మధ్య సమన్వయం లేక బ్రిడ్జి నిర్మాణం కాలేదని పలువురు అంటున్నారు. పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి గాజులు, కరెన్సీమాల


గౌలిదొడ్డి పోచమ్మ, ఎల్లమ్మ ఆలయంలో..


గౌలిదొడ్డిలో వీరలక్ష్మి అలంకారం


రాయదుర్గంలో అమ్మవారి పూజలో భక్తులు

లలితా త్రిపురసుందరిగా..


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో సామూహిక కుంకుమార్చన

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవి, లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలోని ఆలయాల్లో చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే నల్లగండ్లలోని అపర్ణాగ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో పూజతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. రాయదుర్గంలోని మండపం వద్ద అన్నప్రసాదద పంపిణీ చేశారు.

శేరిలింగంపల్లి జోన్ బృందం


ఊరపోచమ్మ అమ్మవారి సన్నిధిలో బస్తీవాసులు


నల్లగండ్ల అపర్ణాగ్రాండేలో బొమ్మలకొలువు

3 నుంచి జిటో కనెక్ట్ ఎగ్జిబిషన్


జీటో కనెక్ట్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ రోహిత్ కొఠారి తదితరులు

బంజారాహిల్స్: జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జిటో) ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు హెచ్ఐసీసీ హైటెక్స్‌లో జిటో కనెక్ట్-2025 ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ రోహిత్ కొఠారి వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిటో కమిటీ సభ్యులతో కలిసి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ది పవర్ ఆఫ్ వన్ అనే థీమ్‌తో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో పలువురు వ్యాపారవేత్తలతో పాటు ఆధ్యాత్మిక గురువులు, రాజకీయ ప్రముఖులు, ఆర్థిక నిపుణులు, సినీ, క్రీడారంగ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ జిటో కనెక్ట్ ప్రారంభోత్సవానికి రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, యోగా గురువు రాందేవ్ బాబా, ఆధ్యాత్మిక గురువు కమలేష్ పటేల్, క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్, టెక్ దిగ్గజం జోహో స్థాపకుడు శ్రీధర్ వెంబు కూడా పాల్గొంటారని వెల్లడించారు. ఈ మహాసభలో 600లకుపైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 2 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొనే అవకాశం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో లలిత్ చోప్రా, బీఎల్ భండారి, సుశీల్ సాంచెట్, గౌతమ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.